క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



డీఎంహెచ్ఓ శర్మిష్టను కలిసి మలేరియా నివారణ అధికారులు

ఏలూరు రూరల్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ శర్మిష్ట అన్నారు. గురువారం మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, మలేరియా ఇన్‌స్పెక్టర్ దుత్తి వేణుగోపాలస్వామి, మలేరియా సూపర్‌వైజర్ డి.దుర్గారావు, హెల్త్ అసిస్టెంట్, సిబ్బంది కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌ఓను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శర్మిష్ట మాట్లాడుతూ నగరంలో మలేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సహకారంతో సీజనల్ వ్యాధులను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ఇందుకోసం చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆకట్టుకుంటున్న లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌లో మహిళల సందడి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక గ్రాండ్ అర్య హోటల్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రదర్శన, అమ్మకాలు నగర మహిళలను కట్టుకుంటున్నాయి. ముంబయ్, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ తదితర నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శన 8వ తేదీ రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ తెలిపారు.

నిల్వ మాంసం విక్రేతపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: నిల్వ ఉంచిన మాంసం అమ్ముతున్న మటన్‌షాపు యజమానిపై కేసు నమోదుచేసినట్టు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పీరూ మటన్‌షాపులో నిల్వ ఉంచిన మాంసం అమ్ముతున్నారని తమకు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసినట్టు ఎస్సై చెప్పారు. షాపును తనిఖీ చేయగా, నిల్వ ఉంచిన మేక, గొర్రె మాంసం వినియోగదారులకు అమ్ముతున్నట్టు గుర్తించామన్నారు. షాపు పరిసరాల్లో పరిశుభ్రత లేకుండా కాలుష్యం వెదజల్లుతోందని చెప్పారు. దీంతో షాపు యజమాని షేక్ పీరూ సాహెబ్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

- రూ.129 కోట్లతో సరఫరా
- అమృత్ 2.0 పథకంలో ప్రతిపాదనలు రెడీ
- పోణంగిలో 70 ఎకరాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్
- ఎమ్మెల్యే నాని ప్రత్యేక శ్రద్ధతో నిధులు

ఏలూరు టౌన్ : వేసవి వస్తే గతంలో రక్షిత తాగునీటికి ఏలూరులో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. మండువేసవిలో పంపుల చెరువులో నీటి నిల్వ అడుగంటిపోయి జనం చుక్కనీటి కోసం అల్లాడిపోయేవారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్‌కు జనం కష్టాలు వివరించారు. ఏలూరు శివారు ఆశ్రం సమీపంలో ఏకంగా రూ.110 కోట్లతో వంద ఎకరాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించారు. నాలుగు నెలలపాటు భారీఎత్తున నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యంతో ఈ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు' ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమైన 7 గ్రామాల్లోని ప్రజలకు రక్షిత తాగునీటికి ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని మరోసారి విలీన గ్రామాల ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నారు. అమృత్ 2.0 పథకంలో ఏకంగా రూ.129 కోట్లతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. 7 విలీన గ్రామాల్లోని, 80 వేల మంది ప్రజలకు రక్షిత తాగునీరు అందనుంది

విలీన గ్రామాలకు అమృత్ 2.0

ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు గ్రామాల ప్రజలకు రక్షిత తాగునీటి సరఫరాకు ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారు. శనివారపుపేట, సత్రంపాడు, చొదిమెళ్ళ, తంగెళ్ళమూడి, వెంకటాపురం, పోణంగి, కొమడవోలు గ్రామాలకు తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. అమృత్ 2.0 పథకంలో రూ.129 కోట్లు నిధులు వ్యయంతో పనులు చేపడతారు. ఈ ఏడు గ్రామాల్లోనూ సుమారుగా 80 వేల మంది జనాభా ఉండగా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రాబోయే ఏడాదిలోనే విలీన గ్రామాలకు తాగునీటి సరఫరాకు పనులు ప్రారంభించనున్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

ఏలూరు నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లోని ప్రజల నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజూ కార్పొరేషన్ విలీన గ్రామాల్లో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టారు. నల్లదిబ్బ, కొమడవోలు, నాగేంద్ర కాలనీ, సత్రంపాడు, చొదిమెళ్ళ, శనివారపుపేటలోని కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. విలీన గ్రామాల్లో ప్రస్తుతం కొన్ని చోట్ల బోర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు.



ఏలూరు శివారులో ట్యాంకర్లతో తాగునీరు సరఫరా



అమృత్ 2.0 పథకం ప్రణాళిక ఇలా

ఏలూరు శివారు గోదావరి కాలువ వద్ద చాంబర్ నిర్మిస్తారు. గోదావరి జలాలను మెయిన్ పైప్‌లైన్ ద్వారా పోణంగి వరకూ తరలిస్తారు. పోణంగిలో భారీగా 70 ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మిస్తారు. ఇదే చోట 10 ఎంఎల్‌టీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తారు. ఇక్కడ నుంచి పోణంగి, కొమడవోలు, వెంకటాపురం గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తారు. ఇక పంపుల చెరువు వద్ద మరో 15 ఎంఎల్‌టీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మిస్తారు. ఇక్కడ నుంచి పైప్‌లైన్ ద్వారా నాలుగు గ్రామాలకు నీటి సరఫరా చేపడతారు. 30 ఏళ్ళ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రధాన పైప్‌లైన్ 14 కిలోమీటర్లు, సర్వీస్ పైప్‌లైన్ 18 కిలోమీటర్లు, ఇంటింటికీ నీటి సరఫరా పైప్‌లైన్ 80 కిలో మీటర్ల మేర ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏడు గ్రామాల్లోనూ భారీగా 20 మీటర్ల ఎత్తులో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టేలా ఇంజనీరింగ్ అధికారులు డిజైన్ చేశారు.

ప్రతి ఇంటికీ కుళాయి



“ఏలూరు నగరంలో విలీనమైన ఏడు గ్రామాల ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాం. ఎమ్మెల్యే ఆళ్ళనాని నాయకత్వంలో విలీన గ్రామాల్లోని ప్రతి ఇంటికీ రాబోయే ఏడాదిలో కుళాయి కనెక్షన్ ఇచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. అమృత్ 2.0 పథకంలో రూ.129 కోట్లు నిధులు వ్యయం చేసేలా చర్యలు చేపడుతున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ రక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తుంది. – షేక్ నూర్జహాన్, ఏలూరు నగర మేయర్

ఎమ్మెల్యే నాని హయాంలోనే..



ఏలూరు నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని హయాంలోనే జరిగింది. దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో 110 ఎకరాల్లో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేసి నగర ప్రజలకు గోదావరి జలాలు సరఫరా చేశారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మరోసారి విలీన గ్రామాల ప్రజలకు గోదావరి జలాలను శుద్ధి చేసి అందించేందుకు అమృత్ 2.0 పథకంలో పనులు ప్రారంభించనున్నారు. – డాక్టర్ దిరిశాల వరప్రసాద్, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్

బాధితులకు న్యాయం చేశాకే నిర్మాణాలు

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజల సహకారం అవసరమని, బాధితులకు న్యాయం చేశాకే నిర్మాణ పనులు చేపడతామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఏలూరు మార్కెట్ యార్డ్ సమీపంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణలో ఇళ్లు కోల్పోతున్న పలువురితో ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాని గురువారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. 50వ డివిజన్‌కు చెందిన సుమారు 80 కుటుంబాల ప్రజలను ఏఎంసీ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానిని కలిశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరంలో పెరుగుతోన్న జనాభా అవసరాలకు అనుగుణంగా రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. మార్కెట్ యార్డ్ సమీపంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో నగర ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు సమీపంలోనే స్థలాలు కేటాయింపుతో పాటు ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే నాని హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం చేసేందుకు అందుబాటులోని స్థలాల వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసాకే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే నాని తెలిపారు. సమావేశంలో ఏలూరు డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్, తదితరులు ఉన్నారు.



క్యాంపు కార్యాలయంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని



సమావేశానికి హాజరైన ప్రజలు

మత్తు మందు వికటించడంతో పరిస్థితి విషమం

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయించుకునేందుకు వెళ్లిన మహిళకు వైద్యులు సరిగా మత్తు ఇంజెక్షన్ చేయకపోవడంతో ఆకస్మాత్తుగా కూలబడింది. ఆమెను వెంటనే ఐసీయూలో చేర్పించారు. ఆమె వెంటిలేటర్‌పై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. చింతలపూడి మండలం రేచర్ల గ్రామానికి చెందిన వరిగంటి మాణిక్యం(52) కంటి చూపు తగ్గడంతో చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి వెళ్ళారు. వైద్యులు పరీక్షించి కంటిలో శుక్లాలు ఉన్నాయని, ఏలూరు జీజీహెచ్‌కు వెళితే ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారని చెప్పారు. చింతలపూడి పరిసర ప్రాంతాలకు చెందిన కంటి ఆపరేషన్లు చేయించుకునే వారిని ఈనెల 6న ఏలూరు ప్రభుత్వాసుపత్రి కంటి విభాగానికి చెందిన మినీబస్సులో బుధవారం మధ్యాహ్నం తీసుకువచ్చి వార్డులో చేర్పించారు. గురువారం ఉదయం వైద్యులు ఆపరేషన్లు ప్రారంభించి నలుగురు వ్యక్తులకు ఆపరేషన్లు పూర్తి చేశారు. ఐదో ఆపరేషన్ మాణిక్యానికి చేసేందుకు ఆపరేషన్ థియేటర్‌కు తీసుకువెళ్ళి మత్తుమందు ఇచ్చారు. మత్తు మందు వికటించి ఆమె కిందపడిపోయారు. హాస్పిటల్‌లోని ఐసీయూలో ఉదయం 11.40 గంటలకు చేర్చారు. మాణిక్యం పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఐసీయూలో ఆందోళన చేపట్టారు. టూటౌన్ పోలీసులు హాస్పిటల్ వద్దకు చేరుకుని రోగులకు ఇబ్బంది కలిగించవద్దని, ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించి బయటకు తీసుకువచ్చారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	14

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	30
ఏలూరు -తిరుపతి	16.00	4830	25

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	22	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-08
బెండకాయలు	20	కంద	40
పచ్చిమిర్చి	30-36	బీట్‌రూట్	36
కాకర కాయలు	20-24	కీరా దోస	36
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	28	అల్లం	110-200
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	07
దోసకాయలు	22	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	50
		నిమ్మకాయలు (డజను)	12-18

ఫిజియోథెరపీ ద్వారా మస్క్యులర్ డిస్ట్రోఫీ నివారణ



ప్రభుత్వ ఆసుపత్రిలో మస్క్యులర్ డిస్ట్రోఫీ అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఏలూరు రూరల్: ఫిజియోథెరపీ ద్వారా మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధిని నివారించవచ్చని డాక్టర్ తివిక్రమ్ మోహన్ అన్నారు. గురువారం వరల్డ్ మస్క్యులర్ డిస్ట్రోఫీ డే సందర్భంగా జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జన్యుపరంగా సంక్రమించే మస్క్యులర్ డిస్ట్రోఫీకి మందులు కనుగొనలేదని తివిక్రమ్ మోహన్ తెలిపారు. తల్లిదండ్రుల ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఫిజియోథెరపీ ద్వారా వ్యాధి నయం చేసుకోవచ్చని సూచించారు. దివ్యాంగుల పునరావాస కేంద్రం కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు అందిస్తున్న కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్‌థెరిఫీ తదితర సేవలు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మణి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

ఏలూరు (టూటౌన్)/ ఏలూరు (ఆర్ఆర్‌పేట) : శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం రెండోరోజూ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా, ఏలూరు నగర యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొత్త పేట చేపలతూము సెంటర్‌లో ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని విశిష్ట అతిథిగా పాల్గొని పూజలు చేశారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీ లక్ష్మి, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీ దేవీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏలూరు నగర యాదవ సంఘం అధ్యక్షుడు బొట్టా అజయ్, కోశాధికారి బోగా రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కిలారపు బుజ్జి, రాష్ట్ర యాదవ సంఘం ఉపాధ్యక్షుడు ఉక్కు సూరి గోపాలకృష్ణ, జిల్లా కోశాధికారి గొర్ల రామారావు, ఏలూరు నియోజకవర్గం అధ్యక్షులు ఆకుల గంగాధర్, జిల్లా నాయకులు చిలకంటి గంగాధర్, పెద్దిబోయిన హరనాథ్, రాష్ట్ర యువజన కార్యదర్శి మల్లిపూడి రాజు తదితరులు పాల్గొన్నారు.

- ఏటిగట్టున ఉన్న జిల్లా యాదవ సంఘం కార్యాలయం వద్ద గురువారం ఉదయం వేదమంత్రాలతో శ్రీ కృష్ణ భగవానునికి జిల్లా యాదవ సంఘం కోశాధికారి గొర్ల రామారావు, నాగమణి దంపతులు శాస్త్రోక్తంగా పూజ చేశారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు శ్రీ కృష్ణుడు, గోపిక వేషధారణల్లో ఆకట్టుకున్నారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు బొట్టా అజయ్‌ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు బుజ్జి, ఆకుల గంగాధర్, మల్లిపూడి రాజు, చిట్టిబోయిన సాయిబాబు, పెద్దిబోయిన హరనాథ్, కె.కృష్ణభగవాన్, దేవీశంకర్, కానుంది గంగాధర్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.
- గో సంరక్షణ సమితి ప్రాంగణంలోని రాధాకృష్ణ మందిరంలో స్వామి వారికి సుప్రభాత సేవ, శ్రీ రాధాకృష్ణ భగవానునికి క్షీరాభిషేకం, అనంతరం తులసి పూజ చేశారు. ఉదయం 8 గంటలకు గోమాతకు ప్రత్యేక పూజలు, 9.30 గంటలకు గో తులాభారం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణ, 11 గంటలకు హౌసీ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బాలగోపాల స్వామికి ఊయల సేవ, 5 గంటల నుంచి కె.స్వర్ణలత శిష్యబృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. ఎనిమిదేళ్లలోపు పిల్లలకు బాలగోపాల వేషధారణ పోటీలు రాత్రి 8 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు నగర మేయర్ కుమార్తె రెయానా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాలను రాధాకృష్ణ మందిర కమిటీ అధ్యక్షుడు మునగాల నాగ వెంకట మురళీకృష్ణ పర్యవేక్షించారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్ రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉట్లోత్సవం, చిన్నారులకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, అనంతరం సంధ్యా హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవత ప్రవచనం చేసి మహా శంఖాభిషేకం, పుష్పాభిషేకాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణలో భక్తులు స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.



గాంధీనగర్‌లోని కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, యాదవ సంఘ నాయకులు



గోసంరక్షణ సమితిలో కృష్ణాష్టమి వేడుకల్లో బహుమతి అందిస్తున్న నగర మేయర్ కుమార్తె రెయానా



గాంధీనగర్‌లోని కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

అభివృద్ధిపై అసత్య ప్రచారం తగదు

ఏలూరు రూరల్: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ఎల్లో మీడియా చేస్తోన్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. గురువారం చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు, పెదయాగనమిల్లి సర్పంచ్ బలే నాగసులోచన, వడ్డీ కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, వైఎస్సార్ సీపీ శ్రీపర్రు నాయకుడు సైదు వజ్రం, పీఆర్ ఏఈ కృష్ణమోహన్, ఎంఈఓ-2 ఆర్ రంగయ్య తదితరులు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిశారు. అభివృద్ధి పనులు, పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రఘు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి చాటపర్రులో ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయి, పైప్‌లైన్, సీసీ రోడ్లు, డ్రెయినేజీ తదితర అభివృద్ధి పనులు చేసినప్పటికీ పలు పత్రికల్లో గోతులమయమైన రోడ్లు చూపుతూ కథనాలు ప్రచురిస్తున్నాయని వాపోయారు. ఎంపీపీ స్పందిస్తూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో గ్రామాల్లో సీసీ రోడ్లు అభివృద్ధికి ప్రభుత్వం రూ.4 కోట్లు రూర్బన్ నిధులు విడుదల చేసిందన్నారు. ఇందులో చాటపర్రులో రూ.75 లక్షలతో 9 సీసీ రోడ్లు అభివృద్ధి చేస్తారని తెలిపారు. టెండర్లు ఖరారయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని ఏఈ కృష్ణమోహన్ చెప్పారు. స్థానిక జెడ్పీ పాఠశాల తరగతి గదులు నిర్మాణ పనులు వేగవంతం చేస్తానని ఎంఈఓ రంగయ్య తెలిపారు. శ్రీపర్రు, పెదయాగనమిల్లి భూ సమస్య పరిష్కరించేందుకు సహకరించాలని శ్రీపర్రు పెద్దలు ఎంపీపీని కోరారు.



ఎంపీపీ శ్రీనివాసరాజుకు సమస్యలు వివరిస్తున్న నాయకులు

సంతాన వేణుగోపాలస్వామికి పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి దేవస్థానం దత్తత క్షేత్రమైన నగరంలోని తూర్పువీధి సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. స్వామి వారికి క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం చేశారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజ నిర్వహించి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారికి గరుడ వాహన సేవ, స్వామివారికి, అమ్మవారికి కోవెలలో ప్రాకారోత్సవం, భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించారు.



గరుడవాహన సేవలో శ్రీ సంతాన వేణుగోపాల స్వామి

ఆధ్యాత్మిక చింతనతోనే అభివృద్ధి

దెందులూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండాలని తద్వారానే అభివృద్ధి, దేవుని దీవెనలు లభిస్తాయని గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. గురువారం వేగవరంలో స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జీ.మోజెస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామస్తులు, ఆర్‌సీఎం సంఘస్తులు సహకారంతో వేళంగిణి మాత ఉత్సవాలు నిర్వహించారు.